## క్లుప్తంగా

### ఈరన్న స్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో ఆలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### 28న అనంత పద్మనాభ వ్రతం



పూజలందుకున్న మంగరాయ ఆంజనేయుడు

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలసిన ఆంజనేయ స్వామి సన్నిధిలో గురువారం శ్రీ అనంత పద్మనాభ వ్రతం పూజలు ఉంటా యని ఆలయ మేనేజర్ వాసుదేవరావు సోమవారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల వారి ఆదేశాల మేరకు ఆలయంలో అనంత పద్మనాభ వ్రతం పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోజున స్వామివారికి విశేష మధుఅభిషేకం, అనంత పద్మనాభ వ్రతం, ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. వ్రతంలో పాల్గొనేవారు పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. 99857 06489 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### శ్రీమఠంలో తెలంగాణ మంత్రి



మఠం ప్రాంగణంలో తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామదేవత మంచాలమ్మకు అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయనతో పాటు తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు, ఏపీఆర్‌ఓ బిందు స్వామి ఉన్నారు.

### శ్రీమఠం హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. ఎండోమెంట్ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కకట్టారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి హుండీ కానుకలు గణన చేస్తున్నట్లు మఠం మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారంతో హుండీ లెక్కింపు పూర్తి కానుంది.

### అలసందగుత్తిలో పోలీస్ పికెట్



పికెట్‌లో పాల్గొన్న పోలీసులు

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు జరిపిన దాడులకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆదేశాల మేరకు సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య, ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులతో పాటు ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లతో పికెట్ నిర్వహించారు. టీడీపీకి చెందిన సోమలింగ, నరసప్ప, లక్ష్మన్న, శంకరప్పతో పాటు పలువురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

# పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ తప్పనిసరి

- ఇప్పటివరకు 90 శాతం నమోదు పూర్తి
- తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు

కోసిగి: ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. రైతుల సాగుచేసిన పంటలు విపత్తుల ద్వారా అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోతే వారికి ఆర్థికంగా అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్ (పంట నమోదు) ను అందుబాటులోకి తెచ్చింది. గత నెల రోజులుగా వ్యవసాయాధికారులు విస్తృతంగా పంట నమోదు ప్రక్రియ చేపట్టారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 99 శాతం వరకు పంట నమోదు పూర్తి చేసినట్లు వ్యవసాయధికారులు వెల్లడించారు. ఈ - క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులందరు తమ పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అనుసంధానంగా రైతులు వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ మేరకు ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులచే ఈ-కేవైసీ పూర్తి చేయిస్తున్నారు.

**పంటల సాగు విస్తీర్ణం**

మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలలో ఏరియా సాగు 1,63,799 ఎకరాల విస్తీర్ణం కాగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,50,182 ఎకరాల్లో పంటల సాగు జరిగింది. అత్యధికంగా పత్తి, వేరుశనగ, మిగతా ఎకరాల్లో మిరప, ఉల్లి, వరి, ఆముదం, కంది, తదితర పంటలు సాగుచేశారు.

**ఈ-కేవైసీతో చాలా ఉపయోగాలు**

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న తర్వాత తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకుంటే రైతులు సాగులో ఉన్నట్లు అంచనా వేస్తారు. ఈ మేరకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా సాగు చేసుకున్న పంటలు చేతికందకపోతే ప్రభుత్వం బీమా వసతితో పాటు నష్ట పరిహారం అమలు చేస్తోంది. పంట రకం ఆధారంగా పరిహారం అందిస్తారు. దీంతో గ్రామాల్లోని రైతులు తామ సాగు చేసుకున్న పంటలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా మొబైల్ యాప్‌లో వేలిముద్రలు నమోదు చేసి ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలి. ఈ-కేవైసీ పూర్తయిన వారికి మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి.



కోసిగిలో రైతులతో ఈ-కేవైసీ నమోదు చేయిస్తున్న వ్యవసాయాధికారులు

**మండలాల వారీగా పంటల సాగు వివరాలు**

| మండలం | సాగైన పంటల విస్తీర్ణం (ఎకరాల్లో) | క్రాప్ బుకింగ్ పూర్తయినది (ఎకరాల్లో) | రైతులు | ఈ-కేవైసీ శాతం |
|---|---|---|---|---|
| కోసిగి | 33,677 | 28,200 | 11,400 | 37 శాతం |
| మంత్రాలయం | 30,250 | 27,800 | 10,250 | 47.35 శాతం |
| కౌతాళం | 68,900 | 63,450 | 18,300 | 31.50 శాతం |
| పెద్దకడబూరు | 31,972 | 30,732 | 10,950 | 30 శాతం |
| మొత్తం | 1,64,799 | 1,50,182 | 50,900 | 35.5 శాతం |

**ఈ-కేవైసీ చేయించుకున్నా**



నాకు ఎకరన్నర బయలు పొలం ఉంది. ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేశాను. అధికారులు పొలం వద్దకు వచ్చి ఫొటో తీసి పంట నమోదు చేసుకున్నారు. మరలా ఈ-కేవైసీ చేయించాలని చెప్పారు. నా ఆధార్ కార్డు ఆధారంగా వేలిముద్రలు నమోదు చేసుకుని ఈ-కేవైసీ చేయించారు. గత ఏడాది పంట నష్ట పరిహారం అందింది. చాలా సంతోషంగా ఉంది.

– కాదయ్య గారి శివయ్య, రైతు, కోసిగి

**ఒక్క పైసా ఖర్చు లేకుండా నమోదు చేశారు**



పెండేకల్లు వద్ద నాకు ముడున్నర ఎకరాల భూమి ఉంది. అందులో ముప్పావు ఎకరం మిరప, ఒకటిన్నర ఎకరం ఉల్లి, మిగతా భూమిలో వేరుశనగ పంటలు సాగుచేశాను. వ్యవసాయాధికారులు పొలం దగ్గరకు వచ్చి క్రాప్ బుకింగ్ చేశారు. మరలా ఈ-కేవైసీ చేశారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా అన్నీ విధాలుగా అధికారులు దగ్గరుండి చేశారు. గత ప్రభుత్వంలో కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు.

– మల్లయ్య, రైతు, పెండేకల్లు

**ఈ-కేవైసీ పూర్తయితేనే పథకాల వర్తింపు**



ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకున్న రైతులందరు క్రాప్ బుకింగ్ చేయించుకుని ఆ తర్వాత తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. కేవలం క్రాప్ బుకింగ్ చేసుకుంటే సరిపోదు. రైతు వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ పూర్తి చేయించుకుంటేనే వారు పంటలు సాగుచేసినట్లు పరిగణలోకి వస్తుంది. రైతులు నిర్లక్ష్యం చేయకుండా దగ్గరుండి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ప్రతి గ్రామంలో ఆర్బీకే వద్ద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ అందుబాటులో ఉండి ఈ-కేవైసీ చేస్తున్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజు, వ్యవసాయధికారి, కోసిగి

### పరీక్ష ఫీజుకు 30వ తేదీ వరకు గడువు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ ఆఖరు అని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న సోమవారం విలేకరులకు తెలిపారు. మొదటి సంవత్సరం లేదా రెండవ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలై పరీక్షలు రాయాలనుకునే వారు రూ.550 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల సబ్జెక్టులలో ఫెయిలైన వారు రూ.1100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు. ఫెయిలైన వారు తిరిగి కళాశాలలో చేరేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆసక్తి ఉన్న వారు చేరవచ్చునని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### సులభ పద్ధతిలో బోధించాలి

కోసిగి: పాఠశాలలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో విద్య నేర్పించాలని ఎంఈఓ-2 నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కోసిగిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అలాగే అక్కడ జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యత లోపించకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో కలిసి నేరుగా పాఠ్యపుస్తకాలలో నేర్చుకున్న అంశాలు పరిశీలించారు. సిలబస్ ప్రకారం రోజు వారీ క్రమం తప్పకుండా ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

## స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



క్రీడా పోటీల్లో సత్తా చాటిన పెద్దకడబూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దకడబూరు: కోసిగి మండలంలో జరిగిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో పెద్దకడబూరు మండల విద్యార్థులు పలు విభాగాలలో ప్రతిభ చాటారు. మండల పరిధిలోని కల్లుకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ - 17 విభాగంలో పి.రుక్మిణి ఖోఖో, 100 మీటర్ల పరుగులో మొదటి స్థానం, 600 మీటర్ల పరుగులో రెండో స్థానం, షాట్‌పుట్‌లో 3వ స్థానం సాధించింది. అండర్ - 14 విభాగంలో కే.నందిని, యు.హరిత కబడ్డీలో స్థానం పొందగా, కేజీ.మౌనిక, కే.శివకుమార్, ఎండీ.ఉదయ్ ఖోఖోలో ఎన్నికయ్యారు. ఎస్‌బి.రామకృష్ణ, ఈ.కిశోర్, హెచ్.కిశోర్, ఈహెచ్.వీరేంద్ర రిలే విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పీడీ శశికళ, పీఈటీ దుబ్బన్న, విద్యార్థులను హెచ్‌ఎం ఉసేనప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

**సత్తా చాటిన పెద్దకడబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు**

పెద్దకడబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాఘవేంద్ర, భీమేంద్ర, రాజు, శివకుమార్, చరణ్, జయశాం, శ్రీకాంత్, రామకృష్ణ, నరేష్, రమేష్, దివాకర్, కృష్ణ అండర్ -14, 17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలలో గెలుపొంది జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం ఉమా రాజేశ్వరి విద్యార్థుల ను అభినందించి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనపరచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సిద్ధరూఢ స్వామికి విశేష పూజలు



సిద్ధరూఢ స్వామికి హారతి ఇస్తున్న పీఠాధిపతి అభినవ సిద్ధరూఢ స్వామి

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధరూఢ స్వామికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేపట్టారు. సోమవారం వేకువజాము నుంచి స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళ హారతులు గావించి పూజలు చేశారు. సాయంత్రం కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి షణ్ముఖరూఢ శాంతాశ్రమం పీఠాధిపతి పరమపూజ్య సద్గురు శ్రీఅభినవ మహాస్వాములు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు కలశాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామ రింగ్ రోడ్డు నుంచి బసవేశ్వర దేవాలయం, చావిడి మీదుగా సిద్ధరూఢ స్వామి మఠం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారికి పీఠాధిపతి హారతి పట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు సిద్ధరూఢ స్వామి విశిష్టతను ఉపన్యసించారు. నవంబర్ 7, 8, 9 తేదీల్లో హుబ్బళ్లిలో నూతనంగా నిర్మించిన ఆరూఢ జ్యోతి సమాధి మందిరం, అభినవ శివపుత్ర మహాస్వాముల మూర్తి ప్రతిష్టాపన, ఆర్ట్ గ్యాలరీ, ద్వాదశ జ్యోతిర్లింగ స్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అందరు హాజరై ధన్యులు కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మురళీమోహన్ రెడ్డి పీఠాధిపతికి శాలువా, పూలమాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆదోనిరూరల్: విజయవాడలో అరెస్టు చేసిన అంగన్‌వాడీ సిబ్బందిని వెంటనే విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు పద్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న, సీనియర్ నాయకులు భీమానందరెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనం రూ.26 వేలకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## కిడ్నాపర్‌గా భావించి దేహశుద్ధి

ఆదోనిఅర్బన్: అప్పు విషయమై మాట్లాడేందుకు వెళ్లగా కిడ్నాపర్ అని దేహశుద్ధి చేసిన ఘటన పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన శ్యాముల్ సి.బెళగల్ గ్రామానికి చెందిన సుదర్శన్ వద్ద రూ.70 వేలు అప్పు తీసుకున్నాడు. సుదర్శన్ ప్రతిరోజు శ్యాముల్‌ను అప్పు తిరిగిఇవ్వాలని కోరుతుండగా ఈ రోజు, రేపు అంటూ మాయమాటలు చెబుతూ తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో సుదర్శన్ హవ్వన్నపేటలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో శ్యాముల్ కుమారుడు చదువుతున్నాడని తెలుసుకుని, అక్కడికి వెళ్లి మీ నాన్నకు డబ్బు తిరిగిఇవ్వాలని చెప్పు అని, తన బైకుపై ఎక్కిస్తుండగా తోటి పిల్లలు కిడ్నాప్ చేస్తున్నాడని భావించి బిగ్గరగా అరిచారు. దీంతో స్థానికులు సుదర్శన్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ నరసింహరాజు చెప్పారు.

### వైఎస్సార్‌సీపీతోనే కురువలకు సముచిత స్థానం

కౌతాళం: వైఎస్సార్‌సీపీతోనే కురవ కులస్తులకు సముచిత స్థానం లభించిందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కురువల అభివృద్ధికి పెద్దపీట వేశారని కుంటనహాల్ గ్రామ ఇన్‌చార్జ్, కురవ సంఘం నాయకుడు శివరాం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 13 మంది సర్పంచ్‌లు, ఆరుగురు ఎంపీటీసీలు, ఒక ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీతో పాటు నామినేటేడ్ పదవులను కురువలకు కేటాయించారని గుర్తుచేశారు. అయినా కురువలకు అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అబద్దాలు చెప్పడం, మోసాలు చేయడం తిక్కారెడ్డికి పుట్టుకతో వచ్చిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో నియోజకవర్గంలో కురువలకు ఎన్ని పదవులు ఇచ్చారో సభాముఖంగా చెప్పే దమ్ము, ధైర్యం ఆయనకు ఉందా అని ప్రశ్నించారు. కురువలకు అన్ని విధాలుగా ప్రాధాన్యత కల్పించింది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు.

### విద్యుత్ సౌకర్యం కల్పించాలి

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో దళితుల కోసం ఆర్డీటీ సంస్థ వారు నిర్మించిన ఇళ్లకు ఎలాంటి చార్జీలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని సీపీఎం నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ మేలిగేరి ఈరన్న దళితులతో కలసి ఏఈ నరసన్నకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. దళిత కాలనీలో ఆర్డీటీ వారు దాదాపు 100 ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆ ఇళ్లలో జనాలు నివశిస్తున్నారని అయితే కాలనీలో విద్యుత్ సమస్య ఉందన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

## విస్తృతంగా ఆరోగ్య సర్వే



కోసిగిలో వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ



వైద్య చికిత్స కోసం టోకెన్ పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఆదోని కార్వన్‌పేటలో మహిళ ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే దీర్ఘకాలికి వ్యాధిగ్రస్తులు, ఆరోగ్య సమస్యలున్న వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించే వైద్య శిబిరంలో చికిత్స పొందాలని సూచిస్తూ టోకెన్లు పంపిణీ చేస్తున్నారు.

కోసిగి: క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ధ్యేయమని కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కోసిగి కడపాళెం వీధిలోని 4, 5వ వార్డులలో, దుద్ది గ్రామంలో వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకున్నారు. దుద్ది గ్రామంలో ఏఎస్‌ఎంలతో కలిసి డాక్టర్ పర్యటించారు. కోసిగిలో 5వ వార్డులో పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ, ఏఎస్‌ఎం భాగ్యమ్మ, 4వ వార్డులో సీహెచ్‌ఓ ఉదయ్ కిరణ్ రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఈ వివరాల ఆధారంగా ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సతో పాటు మందులను అందించనున్నట్లు వెల్లడించారు. ఆశావర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

### కరువు మండలంగా ప్రకటించాలి

ఆదోనిరూరల్: ఆదోనిని కరువు మండలంగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెంకటేశులు, లింగన్న కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అరకొర వర్షాలకు రైతులు పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు అయ్యప్ప, వీరారెడ్డి, తిక్కప్ప, చిరంజీవి, బాషా, హనుమంతరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పల్లెల్లో చిచ్చు రేపుతున్న టీడీపీ



టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: పచ్చని పల్లెల్లో టీడీపీ నాయకులు చిచ్చు రేపుతున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, సర్పంచ్ కోటిరెడ్డి ఆరోపించారు. ఆదివారం అలసందగుత్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ అనుచరులు దాడి చేసి గాయపరించడం అత్యంత హేయమైన చర్య అని, దాడిని తీవ్రంగా ఖండించారు. సోమవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భరత్, వెంకటేష్, ఉచ్చీరప్ప, సీతారాముడు, పెద్దలక్ష్మన్న, రవితో పాటు మరో 10 మందిని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం వచ్చాక మీ అంతు చూస్తామని ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేయడం, ఓ మైనర్ బాలికను ఇంట్లో బంధించి నానా దుర్భాషలాడడం హేయమైన చర్య అన్నారు. బాధితులకు అండగా ఉంటామని అధైర్య పడవద్దని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చెప్పారని మనోధైర్యం కల్పించారు. నాయకులు సోమశేఖర్‌రెడ్డి, తాయన్న, చిగిళి శంకరప్ప తదితరులు ఉన్నారు.

# స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిపాలనాధికారి మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

**స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని**

- మంత్రాలయం మండలం చట్నేహళ్లికి చెందిన సుజనమ్మ జాతీయ రహదారి విస్తరణలో ఇల్లు కోల్పోయింది. ఆమెకు రావాల్సిన నష్ట పరిహారం వేరే వారి పేరిట బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యిందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించింది.
- ఆదోని మండలం బసరకోడు గ్రామానికి చెందిన జి.సురేష్‌కు సర్వే నంబర్ 116లో 2.61 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో రెండకరాలు మాత్రమే నమోదైందని, మిగతా 60 సెంట్ల భూమిని ఆన్‌లైన్లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం బల్లేకల్ గ్రామానికి చెందిన ఈడిగ నాసరయ్యకు పెద్దకడబూరు మండలం నౌనేకల్‌లో సర్వే నంబర్ 289లో 4 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం ఆన్‌లైన్ అడంగల్‌లో పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం సాంబవగల్ గ్రామానికి చెందిన ఆరోగ్య స్వామికి సర్వే నంబర్ 179/1లో 1.50 ఎకరాల భూమి పెద్దల ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం తన పేరు తప్పుగా ఉందని, విచారణ చేసి తన పేరిట నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

కార్యక్రమంలో సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మినారాయణ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో ‘స్పందన’**



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: స్పందనలో కార్యక్రమంలో అర్జీ పెట్టుకున్న వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ చెప్పారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల సమస్యలపై 9 మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇంజినీరింగ్, ఐకేపీ మెప్మా ప్రాజెక్టు, శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫార్మసిస్ట్ డే



ఫార్మసిస్టులను శాలువాలతో సన్మానించిన అవోపా సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), మహిళా విభాగ్ వారిచే సోమవారం ఫార్మాసిస్ట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమాజానికి ఎనలేని సేవలు చేస్తున్న వారిని సన్మానించామని ఆదోని పట్టణ అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా, సెక్రటరీ మిరియాల శ్రీధర్ తెలిపారు. డాక్టర్ తర్వాత డాక్టర్ లాంటివారని, సమాజంలో విలువైన పాత్ర గలవారు ఫార్మసిస్టులు అని చెప్పారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టులు మిరియాల శ్రీధర్, సాయిగణేష్, మురళీ, శ్రీనివాస్, పవన్, కాశీనాథ్, మంజునాథ్ తదితరులను అవోపా వారు శాలువాలు వేసి సన్మానించారు. అవోపా సభ్యులు ప్రతాప్, ఈరన్నశెట్టి, రఘు, రంగా సంగీత, మమతశ్రీ, బిందు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: కోసిగి మండలంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వీరేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాధవరం 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.